# చండీదాసు హితోపదేశం

నిదానంగా ఆలోచించలేని రోజుల్లో దానయ్య ఒక జానకమ్మని వరించి, ముచ్చటకొద్దీ చాంద్‌బీబీ అని పిలుచుకునేవాడు. పెళ్ళయిన కొన్నాళ్ళలోనే పేరు పొరపాటుని చటుక్కున గ్రహించి 'చండిక' అని పిలవాలని ఉబలాటపడ్డాడు. కానీ అనాటికే ఆమె చేతిలో కీలుబొమ్మ అయిపోయాడు. దరిమిలా చండీదాసు బిరుదాంకితుడయ్యాడు. చాంద్‌బీబీ ఉరఫ్ చండిక నిద్రలేచే సరికి స్నానాదికాలు ముగించి కాఫీ చేసేస్తాడు దానయ్య. ఆమె ముందులేస్తే దానయ్య పూర్వాపరాల గురించి అష్టోత్తర శతనామావళి అంత అనర్గళంగా చదివేస్తుంది. అందువల్ల అతనే ముందరలేస్తాడు.

కందా మామిడికాయ వగైరా జాతి కూరలకి దానయ్య చెక్కు తీసి పెడతాడు. పూర్వం చండిక ఒకసారి ఇటువంటి బండపని చేసేసరికి చేతులు కందిపోయాయి. ఒకసారి బొటనవేలు తెగింది. ఆ రోజున చండిక వేసంగి సూర్యుడిలా పేట్రేగి పోయింది. దానయ్య ఆ రోజున ఉపవాసం, ఆ మర్నాడు లంకణం చేశాడు. మొదటిరోజు తరిగి రెండవరోజున వండిన కూరను చండిక బలవంతం మీద మూడోరోజున అరగించాడు.

"ఈ కూరని వెయ్యి నాలుకలున్నవాడు కూడా మెచ్చుకోలేడు" అన్నాడు, అప్పటికి రెండు నాలుకలతో మాట్లాడనేర్చిన దానయ్య. అతనికి రెండు నాలుకలూ దురద పెట్టాయి. మొదటిది కందకూర ప్రభావం వల్ల. రెండోది రెండు రోజులు తిండి లేదు గదా అని చండిక కాస్త మంచిగా ఉండటం వల్ల.

కందకూర తింటూ వెయ్యి నాలుకలున్నవాడు కూడా దీన్ని మెచ్చుకోలేడని దానయ్య అన్న మాటలలో రెండర్థాలు కనపడి చండిక మండిపడింది.

ఆ తరవాత దానయ్య నోట్లో నాలికలేని వాడయిపోయాడు. తెల్లవారకుండా నిద్రలేవడం, స్నానాదికాలు ముగించడం, కందా కాకరకాయ వంటి కూరలన్నీ దురదా చేదూ అనకుండా నోరు మూసుకు అరగించడం వంటివెన్నో అలవరచుకున్నాడు.

కొన్నాళ్ళకి కొడుకును కన్నాడు. ఆ కొడుకు పాతికేళ్ల వరకూ అమ్మ చెప్పుచేతుల్లో బంగారు తండ్రల్లె బాచాలకొండల్లె పెరిగి, హఠాత్తుగా ఒకనాడు పెద్దవాడై, అమ్మనెదిరించి, కాలేజీలో ఓ అమ్మాయిని ప్రేమించిమరీ పెళ్లి చేసుకున్నాడు. దరిమిలా బస్తీలో కొలువు కుదిరి కాపరం పెట్టాడు. దానయ్య అడపాతడపా బస్తీవెళ్లి కొడుకు సంసారం తీరుతెన్నులు చూచి, భార్యకా బోగట్టా చెబుతూ వుండేవాడు. కొత్తలో దానయ్య, 'జానకమ్మ ఉరఫ్ చాంద్‌బీబీ అనే చండికల' సంసారంలాగే అన్యోన్యత కనబడింది. దరిమిలా కనపడటం మానేసింది. ఏడాది తిరిగేసరికి

కొడుకుదే పై చెయ్యిగా చెలామణి అవుతున్నట్లు ఊహతోచింది. దానయ్యకి వింతగా కనపడింది.

ఒకరోజున 'చండీదాస మండలి'లో ఈ ఊహ బయటపెట్టాడు. చండిక వంటి భార్యలు కలవారంతా ఈ మండలిలో సభ్యులు. తమ భార్యలు ఎలా రాసి రంపాన పెట్టేదీ వెళ్లబోసుకుంటారు. ఈ గోష్ఠికి రాగలగడం ఒక సుఖం. కాబట్టే, ఈ సౌఖ్యానికై తామెంత కష్టపడిందీ చెప్పుకుంటారు. మండలి సభ్యులపేర్లు (గోష్ఠిలో మాత్రమే) చండీదాసు, ఉమాపతి, రమాపతి, సీతాపతి మొదలైనవి. అన్నీ భార్యల పేర్లను బట్టి ఏర్పడుతాయి. ఒక చండీదాసు చెప్పే కష్టాలువిని, మిగతావారిలో కొందరు సానుభూతి, ధైర్య సాహసోపేతులైనవారు సలహాలూ ఇస్తారు- పెళ్లాలకు తెలిస్తే తెలిసిందిలే అన్న ధీమాతో.

దానయ్య ఒకనాటి గోష్ఠిలో తన కొడుకు కాపరం ముచ్చట చెప్పి, "ఏడాది తిరిగినా మావాడిదే పైచెయ్యి సుమండీ" అన్నాడు. సదస్సులంతా ఇది సాధ్యమా, సంభవమా అని విస్తుపోయారు- మానవాళి భవిష్యత్తుకి అది మంచిదో చెడ్డదో ఎవరూ నిర్ధారణ చెయ్యలేకపోయారు.

"మా ఆవిడని కనుక్కొని రేపు చెబుతాను" అన్నాడు దానయ్య చివరికి.

ఆ రాత్రి అతను ఇంటికి వెళ్ళేసరికి ఆవిడ ఎన్నడూ లేనంత ఆదరంతో అన్నం పెట్టింది.

"అబ్బాయివచ్చి వెళ్లాడు" అంది.

"ఎప్పుడూ" అన్నాడు దానయ్య.

"ఎప్పుడేమిటండీ నాబొంద. సాయంత్రం మీరు ఊరేగేదాకా రాలేదని మీకు తెలుసు కదా. ఇప్పుడు మీరొచ్చాక నేను చెబుతే ఎప్పుడూ అంటూ అడుగుతారేమిటండీ. అయినా దృష్టి ఇక్కడుంటేగా" అంది ఆవిడ.

దానయ్య ముహూర్తబలం అనుకూలంగా లేదని గ్రహించి నోరుమూసుకున్నాడు.

"కోడలు పిల్లవాణ్ణి రాసి రంపాన పెడుతూందట. నిత్యం పోరేనట. కుర్రాడు దాంతో వేగలేక చిక్కి సగమైపోయాడు. కాంపుకెళ్తూ ఇక్కడ ఆగి ఇవన్నీ నాతో చెప్పుకు ఊహూ ఇదైపోయాడు కుఱ్ఱ నాగన్న. వాడు యతి అంటే ప్రతి అంటుందిట. వాడేం మొగుడనుకుందో నౌకరీ వెధవనుకుందో" అంది జానకమ్మ ఉరఫ్ చండికేశ్వరి.

తనకళ్లకి వీరాధివీరుడిగా కనపడ్డ కొడుకు నిజంగా అంతటివాడు కాదని భార్యవల్ల గట్టిగా తెలుసుకోగానే తన అంచనాలు వేసే శక్తి ఎంతగా దెబ్బతిందో, ఆలోచనాశక్తి ఎంత కుదించుకుపోయిందో దానయ్యకు కొంత స్ఫురించింది.

'అన్యోన్య దాంపత్యం' స్థిరపడడానికి తన కొడుకు ఇంకా అన్ని ఘట్టాలూ దాటలేదని తిట్టింది. దాటించేయడం ఎంతసేపులే అనుకున్నాడు.

దానయ్య ఆవకాయముద్ద ఒకటే నమిలి మింగేలోగా ఆవిడ, "రేపే మీరు బస్తీ వెళ్లండి. వెళ్ళి దానికి మొహం వాచేట్లు చివాట్లు వెయ్యండి" అని రెండు అజ్ఞలు

'లేకపోతే నేనే బయల్దేరి దాని సంగతి కనుక్కుంటా' అని ఒక హెచ్చరిక జారీ చేసింది.

వెళ్లినపుడు నడిచివెళ్ళమంది. వచ్చేటపుడు పడవమీద రావడానికి కేవు డబ్బులిచ్చింది. దానయ్య మర్నాడు తెల్లవారుతూ ఉండగానే తరవాతే అన్నం తినేసి, కండువా భుజాన వేసుకుని, ధైర్యం, కాఠిన్యం మొహాన పులుముకుని పట్నం బయల్దేరాడు. కాలవ వొడ్డు చేరగానే శుభ్రంగా మొహం కడుక్కుని ప్రయాణం కొనసాగించాడు. ఉదయం ఎనిమిది వేసేసరికి అడంగిచేరి తలుపుతట్టాడు.

కోడలికి మావగారంటే ఎంతో గౌరవం. తన తండ్రి అంత మంచివాడని మంచి నమ్మకం. అందుకని, తలుపుతీసి మళ్లా నిద్రపోకుండా వెంటనే మొహం కడుక్కొని కాఫీచేసి ఆయనకిచ్చింది.

దానయ్యకి కాఫీ అంటే పంచప్రాణాలూనూ. ఆరోజుదయం తరవాణి దాహం పుచ్చుకుని బయల్దేరాడు. అయినా సరే కాఫీ తాగి, కోడలిని కుశలం అడిగాడు: "మా వాడసలే పెంకి వెధవమ్మ. సరిగ్గా ఉంటున్నాడా?" అన్నాడు.

కోడలు సంతోషపడి సోదె విప్పింది.... ఆయన అస్తమానం విసుక్కుంటారు. పొద్దున ఎనిమిదయినా అవకుండా నిద్రలేవాలంటారు. యతంటే ప్రతంటారు...

"ఒకటేమిటి. రాసిరంపాన పెడుతున్నారనుకోండి మావయ్యా. నేను కాబట్టి సర్దుకుని పొరపొచ్చెం లేకుండా రోజులు వెళ్ల బుచ్చుతున్నాను" అంది.

దానయ్య గుండె కరిగి నీరైపోయింది.

"రాలుగాయ వెధవ. రణపెంకి వెధవ. నిన్నిలా బాధలు పెట్టి, నిన్న మాయింటి కొచ్చి మీ అత్తగారితో నీమీద చాడీలు చెబుతాడూ, తప్పుకాదూ.. మొగుణ్ణే కొట్టి మొగసాలెక్కినట్టు.... అమ్మడూ చూడు. ఈ ముక్క నేనన్నట్లు మళ్లా ఎక్కడేనా అనేవు సుమా" అన్నాడు.

"అనను మావయ్య ఒట్టు. కాపరం చక్కపెట్టుకునే మార్గం చెప్పండి మావయ్య" అంది కోడలు ప్రాధేయ పూర్వకంగా.

"మార్గాలు నాకు తెలీవు కానీ నేను గడించిన ముప్పైఏళ్ళ అనుభవం చెబుతా. కొంచెం కీలకం తెలిసి మసులుకుంటే మీ ఇద్దర్నీ చిలకాగోరింకలంటారు నలుగురూ. అన్యోన్య దాంపత్యం అంటారు. ముచ్చటైన కాపరం అని ముచ్చట పడతారు" అంటూ దానయ్య తన 30 ఏళ్ల సాంసారిక జీవితానుభవాలను చెప్పాడు.

"వేయేల నమ్మా మీ అత్తగారినీ ఆదర్శంగా తీసుకో. మా కాపురం చూసి కీలకం తెలుసుకో" అని హితోపదేశం చేశాడు.

కోడలమ్మ నోరూరగ చవులు బుట్ట వింది.

రాత్రి దానయ్య ఇల్లు చేరగానే "గట్టిగా చివాట్లేశారా" అనడిగింది భార్య.

"మొహం వాచేలా. నెల తిరగనీ" అన్నాడు దానయ్య కఠిన స్వరంతో. ఆ పూటకే అట్టే మాట్లాడటానికి చండిక కూడా ఒక్క రవ్వ జంకింది.

☆ ☆ ☆

నెల తిరిగేసరికి కొడుకూకోడలూ ఇంటికే వచ్చి రెండు రోజులున్నారు. వాళ్ళ కాపురం పొరపొచ్చెం లేకుండా సాగిపోతున్నదన్న సంగతి ప్రతిమాటలోనూ కనపడింది

చండికకు. కొడుకు ప్రయోజకుడై పెళ్ళాన్ని అదుపాజ్ఞల్లో పెట్టినందుకు మొదటిరోజు సంతోషించిందావిడ. రెండోరోజు వీళ్ళిద్దరూ ఒక్క తాటిమీద ఎలా నడవగలుగుతున్నారు చెప్మా అనుకుంది. మూడోరోజున కోడలు పట్నం వెళ్ళిపోదామంది. అంతకుముందే మరో రెండు రోజులుంటానన్న కొడుకు అర్జంటు పనుంది అన్నాడు!

☆ ☆ ☆

ఆరోజు రాత్రి చండిక అన్నం వడ్డించి దానయ్యను యీ విషయమై కదిపింది. దానయ్య గంభీరంగా నవ్వి "చూశావా నా చివాట్ల ప్రభావం. కోడలు పిల్ల పిల్లిపిల్లయి పోయింది" అన్నాడు.

చండిక పెదవి చప్పరించింది.

"ఏమో సుమండి. అబ్బాయి కోడలుతో మాట్లాడినపుడు వాడి మొహంలో మీ ఛాయలే కనపడుతున్నాయి. ఉన్నమాట చెప్పాలంటే ముమ్మూర్తులా మీలాగే తయారయ్యాడనిపిస్తుంది" అంది.

కీలకం బయటపడిందనగానే దానయ్య మొహం ఒక్కరవ్వ బిక్కవోయింది.

"ఇదా మీరు చేసిన నిర్వాకం" అంది చండిక గుట్టు కనిపెట్టేసి.

దానయ్య ఆ రోజు అర్ధాకలితో పడుకున్నాడు. మర్నాడు ఉపవసించాడు. మూడోనాడు లంకణం చేశాడు.

☆ ☆ ☆

★ ★ ★